
# సాక్షి
## అన్నమయ్య జిల్లా

సోమవారం । 22 । జనవరి । 2024



### ఆధ్యాత్మిక సిరి.. అరుణగిరి

ప్రతి పౌర్ణమికి చిన్నాపెద్దా తేడా లేకుండా పెద్ద ఎత్తున అరుణాచలంలో గిరిప్రదక్షిణలకు తరలివెళ్తున్నారు. యాత్ర ప్రత్యేకతలపై కథనం. -8లో



### మహిళను కాపాడిన ఆర్‌పీఎఫ్

కుటుంబ కలహాల కారణంగా ఆత్మహత్యకు పాల్పడబోయిన ఓ మహిళను ఆర్‌పీఎఫ్ సిబ్బంది కాపాడి కుటుంబ సభ్యులకు అప్పగించారు. -8లో

మదనపల్లె : టమాటా ధరలు (10 కిలోలు)

| | కనిష్టం | గరిష్టం |
|---|---|---|
| మొదటిరకం | రూ.190 | రూ.260 |
| రెండోరకం | రూ.100 | రూ.186 |

మార్కెట్‌కు వచ్చిన మొత్తం సరుకు : 132 మెట్రిక్ టన్నులు



## న్యూస్‌రీల్

### నేడు 'స్పందన'

రాయచోటి: ప్రజల నుంచి ఫిర్యాదులను స్వీకరించి వాటి పరిష్కారానికి నేడు సోమవారం స్పందన కార్యక్రమం జరగుతుంది. ఈ విషయాన్ని జిల్లా జాయింట్ కలెక్టర్ ఫర్మాన్ అహ్మద్ ఖాన్ ఆదివారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు.

### ఓపెన్ స్కూల్ అడ్మిషన్లకు నోటిఫికేషన్ విడుదల

కడప ఎడ్యుకేషన్: ఓపెన్ స్కూల్ పదో తరగతి, ఇంటర్- 2023-24 విద్యా సంవత్సరానికి సంబంధించి రెండో విడత అడ్మిషన్లకు ప్రభుత్వం నోటిఫికేషన్ విడుదల చేసినట్లు డీఈఓ రాఘవ రెడ్డి, ఓపెన్ స్కూల్ జిల్లా కో-ఆర్డినేటర్ కేవీ సుబ్బారెడ్డి తెలిపారు. ఈనెల 22వ తేదీ నుంచి అడ్మిషన్లు ప్రారంభమై 30వ తేదీకి ముగుస్తాయన్నారు. తరువాత 31వ తేదీ ఒక్క రోజు వెయ్యి రుపాయల ఫైన్‌తో అడ్మిషన్స్ పొందవచ్చని తెలిపారు. జిల్లాలో అర్హులైన అభ్యర్థులు అడ్మిషన్లను పొందవచ్చని వారు పేర్కొన్నారు.

### అంతర్‌రాష్ట్ర క్రికెట్ పోటీలకు ఎంపిక

మైదుకూరు: అండర్-14 విభాగం క్రికెట్ పోటీలకు మైదుకూరు మున్సిపాలిటీలోని చిన్నయ్య గారిపల్లెకు చెందిన విద్యార్థి అన్నపురెడ్డి కశ్యప రెడ్డి ఎంపికయ్యాడు. డొమెస్టిక్ సీజన్‌లో భాగంగా ఇటీవల గుంటూరులో జరిగిన పోటీల్లో ఈ విద్యార్థి పేస్ బౌలింగ్ విభాగంలో ప్రతిభ కనబరిచాడు. ఈ నెల 23 నుంచి గోవాలో జరిగే అంతర్‌రాష్ట్ర అండర్-14 క్రికెట్ పోటీలకు ఎంపికయ్యాడు. స్థానిక ప్రైవేటు పాఠశాలలో 9వ తరగతి చదువుతున్న కశ్యప్‌రెడ్డి తల్లిదండ్రులు అన్నపురెడ్డి శుభ భాస్కర్‌రెడ్డి, గాయత్రి ప్రైవేటు ఉద్యోగులుగా ఉన్నారు. తమ కుమారుడికి కడపలోని ప్రైవేటు క్రికెట్ అకాడమీలో కోచింగ్ ఇప్పించామని, అంతర్‌రాష్ట్ర పోటీలకు ఎంపిక కావడం ఆనందంగా ఉందని శుభ భాస్కర్‌రెడ్డి తెలిపారు.

### బస్సులు కిటకిట



కడప బస్టాండులో ప్రయాణికుల రద్దీ

కడప కోటిరెడ్డి సర్కిల్: సంక్రాంతి పండుగకు పల్లెలకు వచ్చిన వారు తిరుగు ప్రయాణం అవుతున్నారు. దీంతో బస్సులు కిటకిటలాడుతున్నాయి. ప్రయాణికులకు ఎలాంటి ఇబ్బందులు ఏర్పడకుండా ఆర్టీసీ అధికారులు చర్యలు చేపడుతున్నారు. ఆదివారం రాత్రి వైఎస్సార్ జిల్లాలోని కడప, బద్వేల్, మైదుకూరు, ప్రొద్దుటూరు, జమ్మలమడుగు, పులివెందుల డిపోల నుంచి అన్ని ముఖ్య పట్టణాలకు బస్సులు ఏర్పాటు చేశారు ప్రయాణికుల రద్దీ ఎక్కువగా ఉండడంతో జిల్లా నుంచి 60 స్పెషల్ బస్సులు నడుపుతున్నారు. వీటిలో విజయవాడ బస్సులు 20, హైదరాబాద్ 18, బెంగళూరు 17, చెన్నైకి ఐదు బస్సుల చొప్పున ఏర్పాటు చేశారు. కడప ఆర్ఎం గోపాల్ రెడ్డి, డిపో మేనేజర్ ఢిల్లీశ్వరరావు, అసిస్టెంట్ మేనేజర్ కన్యాకుమారి, యూనియన్ నాయకుడు బాబా ఫక్రుద్దీన్ తదితరులు ఏర్పాట్లను పరిశీలించారు.



# రైలుపల్లె.. రెడ్డిపల్లి

- కాలగర్భంలోకి రైల్వేస్టేషన్
- నాడు బ్రిటీష్ రాణిచే ప్రారంభం






చరిత్ర కల్గిన రెడ్డిపల్లి రైల్వేస్టేషన్

పుల్లంపేట: చెన్నై-ముంబై రైలు మార్గంలో తొలుత ఏర్పడిన స్టేషన్ రెడ్డిపల్లి. రైలు రావడానికి కారణమైన పల్లె గనుక ఇప్పటికీ రైలు పల్లెగా ప్రసిద్ధి కెక్కింది. అయితే రైల్వేశాఖ ఈ రైల్వేస్టేషన్ ఆనవాళ్లు లేకుండా చేసిందనే విమర్శలను మూటకట్టుకుంది. దక్షిణ భారతదేశంలో తొలి రైల్వేస్టేషన్‌గా రెడ్డిపల్లిను చెప్పుకుంటారు. తర్వాత ఇక్కడి నుంచి నందలూరు వరకు రైలు మార్గం వేశారు. చెయ్యేరు నీరు శ్రేష్ఠమని భావించి రైలు ఇంజిన్ల నిర్వహణ కోసం లోకోషెడ్ నిర్మించేందుకు బ్రిటీషు రైల్వేపాలకులు ముందుకొచ్చారు.

**రాయపురం నుంచి.....**

మద్రాసు, సందరన్ మరాఠా రైల్వేస్ పరిధిలో రెడ్డిపల్లి రైల్వేస్టేషన్ ప్రారంభమైంది. ఇక్కడి నుంచి తమిళనాడులోని రాయపురం వరకు 153 కిలోమీటర్లు రైల్వేట్రాక్ నిర్మించారు. ఇదంతా 1857 ప్రాంతంలో జరిగింది. దేశంలో తొలి రైలుమార్గం ముంబై-థానా మధ్య నిర్మితమైన క్రమంలో రెడ్డిపల్లి రైల్వేస్టేషన్ వరకు ట్రాక్ నిర్మితమైందని సమాచారం. రైల్వేస్టేషన్‌ను పూర్తి బర్మా టేకుతో నిర్మించారు.

**మద్రాసు నుంచి నేరుగా రెడ్డిపల్లి వరకు.....**

మద్రాసు నుంచి నేరుగా రెడ్డిపల్లి వరకు గూడ్స్, ప్యాసింజర్ రైళ్లు నడిచేవి. బొగ్గుతో నడిచే రైలింజన్లతో రైళ్ల రాకపోకలను కొనసాగించారు. ఈ స్టేషన్‌లో మద్రాసు-రాయచూరు-రేణిగుంట-గుంతకల్లు ప్యాసింజర్ రైళ్లు ఆగేవి. అరక్కోణం , కడప ప్యాసింజర్ రైళ్లు కూడా నిలిచేవి.

**2003-2004 మధ్యలో రైల్వేస్టేషన్ మూసివేత**

ఇండియా రైల్వేలో మీటర్‌గేజ్‌లను బ్రాడ్‌గేజ్‌లుగా మార్చడం.. సింగల్ లైన్ ఉన్న రైల్వేస్టేషన్‌ను డబుల్ లైన్ చేశారు. ఈ క్రమంలో 2003-2004లో స్టేషన్‌ను మూసివేశారు. స్టేషన్ మాస్టర్లను, పాయింట్‌మెన్‌లను అందరినీ బదిలీ చేశారు. తర్వాత కాంట్రాక్టు పద్ధతిలో రైల్వే టికెట్లు ఇచ్చేందుకు బుకింగ్ రూమ్ నిర్మించారు. లెవెల్ క్రాసింగ్ గేటు బ్రిటీష్ కాలం నుంచి నేటి వరకు కొనసాగుతోంది.

- స్టేషన్ మూసివేతకు ప్రధానంగా రెడ్డిపల్లికి మూడున్నర కిలోమీటర్ల దూరంలో పుల్లంపేట రైల్వేస్టేషన్, ఏడున్నర కిలోమీటర్ల దూరంలో ఓబులవారిపల్లె స్టేషన్‌లు ఉన్నాయి. రైళ్లవేగం పెరిగిన క్రమంలో నాలుగు, ఐదు నిమిషాల్లో రైలు రెడ్డిపల్లి స్టేషన్ దాటి పోతుంది. ఆ స్టేషన్ ఉండటం వల్ల రైల్వేకు ఎలాంటి లాభదాయకం కాదని అప్పటి డీఆర్‌ఎం నివేదిక సమర్పించారు. దీంతో రైల్వేబోర్డు స్టేషన్‌ను మూసివేసిందని రైల్వే వర్గాలు తెలిపాయి. స్టేషన్‌ను మూసి వేయవద్దని కార్మికసంఘాలు చేసిన విజ్ఞప్తిని అధికారులు పెడచెవిన పెట్టారు.
- బ్రిటీషు రైల్వేపాలకుల హయాంలో రెడ్డిపల్లి రైల్వే స్టేషన్‌ను కేంద్రంగా చేసుకొని ముంబై-చెన్నై రైలు మార్గం నిర్మించారు. ఈ స్టేషన్‌లో రెండు లైన్లు, ఒక ప్లాట్‌ఫామ్ ఉండేది. గూడ్స్ సైడింగ్‌ను కూడా బ్రిటీషర్లు ఏర్పాటు చేసుకున్నారు. 1980లో ఈ సైడింగ్‌ను మూసివేశారు. ఇక్కడి నుంచి గూడ్స్ వ్యాగన్‌లో కర్రబొగ్గు, ఎర్రగడ్డలు, తమలపాకు, నిమ్మకాయలు మద్రాస్ హార్బర్‌కు తీసుకెళ్లి అక్కడ నుంచి గోధుమలు, బార్లీ దిగుమతి అయ్యేవి.

### రెడ్డిపల్లి రైల్వేస్టేషన్‌లో విక్టోరియా రాణి....



రెడ్డిపల్లి రైల్వేస్టేషన్ వరకు రైల్వేట్రాక్ వేశారు. విక్టోరియా రాణి ఇక్కడికి వచ్చి దీనిని ప్రారంభించారు. రైల్వేమార్గం పురోగతిపై నాటి రైల్వేపాలకులతో చర్చించి నిర్ణయాలు తీసుకున్నారు. ఇప్పటికీ రెడ్డిపల్లి రైల్వేస్టేషన్ పరిధిలో రైల్వేకు ఎకరాల్లో స్థలం ఉంది. నిన్న మొన్నటివరకు బ్రిటీష్ రైల్వేపాలకుల చిహ్నాలు ఉండేవి.

### భావితరాలకు తెలియాలి



బ్రిటీషు కాలం నుంచి చరిత్ర కల్గిన రైల్వేస్టేషన్లు గురించి, ఆనాటి పరిజ్ఞానం, రైళ్ల గురించి భావితరాలకు తెలియాల్సిన ఆవశ్యకత ఉంది. అయితే ఇప్పుడు రైల్వే లాభాలు చూసుకుంటోంది. చరిత్ర కల్గిన స్టేషన్లు కాలగర్భంలో కలిసిపో యాయి. ఇందులో రెడ్డిపల్లి రైల్వేస్టేషన్ ఒకటి.

– తల్లెం భరత్ కుమార్ రెడ్డి, గుంతకల్ రైల్వే బోర్డు మెంబర్

### సరుకుల రవాణాకు అనుకూలం



దక్షిణ భారతదేశంలోనే మొట్టమొదటి రైల్వేస్టేషన్ రెడ్డిపల్లి.దీనికి ఎంతో ప్రాముఖ్యత ఉండేది. ఇక్కడి నుంచి ఇంగ్లాడుకు సరుకుల రవాణ జరిగింది. బ్రిటీషు రైల్వేపాలకులు రెడ్డిపల్లికి ప్రాధాన్యత ఇచ్చారు. ఇప్పుడు స్టేషన్ లేకుండా పోవడం విచారకరం.

– ముస్తాక్, మండల కన్వీనర్

### పునరుద్ధరించాలి



చరిత్ర కల్గిన రైల్వేస్టేషన్ రెడ్డిపల్లి జిల్లాలో ఉండడం గర్వకారణం. మా పూర్వీకుల నుంచి స్టేషన్ రాకపోకలకు అనుకూలంగా ఉండేది. నేడు దీనిని ఆనవాళ్లు లేకుండా చేయడం బాధాకరం. ఈ స్టేషన్‌ను పునరుద్ధరిస్తే అందరికీ ఉపయోగంగా ఉంటుంది.

– జనార్దన్, రెడ్డిపల్లి, పుల్లంపేట మండలం

### క్రీడల్లోనూ ప్రావీణ్యం చూపాలి



విజేతలకు బహుమతులు అందజేస్తున్న జెడ్పీ చైర్మన్ ఆకేపాటి అమరనాథరెడ్డి

రాజంపేట రూరల్: యువత క్రీడల్లోనూ ప్రావీణ్యం చూపాలని జెడ్పీ చైర్మన్ ఆకేపాటి అమరనాథరెడ్డి పేర్కొన్నారు. ఈసందర్భంగా జెడ్పీ చైర్మన్ ఆకేపాటి మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం క్రీడలకు పెద్దపేట వేస్తోందన్నారు. గ్రామీణ క్రీడాకారుల్లో ప్రతిభను వెలికితీసేందుకు 'ఆడుదాం ఆంధ్ర'ను ప్రవేశపెట్టిందన్నారు. మండల పరిధిలోని మందపల్లి పంచాయతీలో నిర్వహిస్తున్న క్రికెట్ పోటీల విజేతలకు ఆదివారం ఆకేపాటి బహుమతులు అందజేశారు. పోటీల్లో 18 జట్లు పాల్గొన్నాయిన్నారు. యల్లగడ జట్టుకు ప్రథమ బహుమతి రూ.20వేలు, మందపల్లి వడ్డిపల్లికి చెందిన జట్టుకు ద్వితీయ బహుమతి రూ.10లు అందజేశారు. కార్యక్రమంలో క్రీడాకారులు, ప్రజలు పాల్గొన్నారు.

### జాతీయ కబడ్డీ పోటీలకు ఏర్పాట్లు

రాయచోటి: రాజంపేటలోని ఇన్ఫాంట్ జీసస్ హై స్కూల్లో ఈనెల 28వ తేదీ నుంచి ఫిబ్రవరి 1 వరకు నిర్వహించనున్న అండర్ 14 బాలికల జాతీయ కబడ్డీ పోటీలకు ఏర్పాట్లు చకచకా సాగుతున్నాయి. డీఆర్‌ఓ సత్యనారాయణ విద్యాశాఖ అధికారులతో కలిసి ఏర్పాట్లు పర్యవేక్షిస్తున్నారు. ఈ పోటీలకు రాష్ట్రంలోని జవహర్ నవోదయ పాఠశాలల నుంచి 44 జట్లు రానున్నాయి. ఆసక్తి గలవారు ఈనెల 22 వరకు ఆన్లైన్ రిజిస్టర్ చేయించుకోవచ్చని నిర్వాహకులు సూచిస్తున్నారు. కబడ్డీ క్రీడా పోటీలకు 450 మంది క్రీడాకారులు హాజరవుతారని అధికారులు చెబుతున్నారు. ఎలాంటి సమస్యలు తలెత్తకుండా పోటీలను నిర్వహించి జిల్లాకు మంచి పేరు తీసుకురావడానికి అధికారులు కృషి చేయాలని డీఆర్‌ఓ సత్యనారాయణ సూచించారు.

## మత్స్యకారుల అభివృద్ధే ప్రభుత్వ ధ్యేయం



బ్రహ్మంసాగర్‌లో చేప పిల్లలను వదులుతున్న ఎమ్మెల్యే రఘురామిరెడ్డి తదితరులు

బ్రహ్మంగారిమఠం: మత్స్యకారుల అభివృద్ధికి ప్రభుత్వం కృషి చేస్తోందని వైఎస్సార్ జిల్లా మైదుకూరు ఎమ్మెల్యే శెట్టిపల్లె రఘురామిరెడ్డి అన్నారు. బ్రహ్మంగారిమఠంలోని బ్రహ్మంసాగర్‌లో ఆదివారం మత్స్యశాఖ ఆధ్వర్యంలో ఎమ్మెల్యే 2.50లక్షల చేప పిల్లలను వదిలారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మత్స్యకార్మికులకు ప్రభుత్వం అన్ని రకాలుగా చేయూతనిస్తోందన్నారు. ప్రతి ఏటా బ్రహ్మంసాగర్‌లో చేప పిల్లలను వదలడం వల్ల ఇక్కడ ఉన్న మత్స్యకారులకు జీవనోపాధి లభిస్తోందన్నారు. మండలంలోని జాలర్లు గ్రూపుగా ఏర్పడి మత్స్యశాఖ ఆదేశాల మేరకు చేపలవేట చేపట్టాల్సి ఉందన్నారు. జిల్లా మత్స్యశాఖ డిప్యూటీ డైరెక్టర్ మాట్లాడుతూ బ్రహ్మంసాగర్ రిజర్వాయర్ పరిధిలో 300 మంది జాలర్లు ఉన్నారన్నారు. సంఘంలో గుర్తింపు ఉన్నవారు రెన్యువల్ చేయించుకోవాలన్నారు.ఇప్పటి వరకు కేవలం 23 మంది మాత్రమే రెన్యువల్ చేయించుకున్నారన్నారు. ప్రభుత్వం కల్పించే పథకాలు అందుకోవాలంటే రెన్యువల్ తప్పనిసరి అని అన్నారు. సాగర్‌లో ప్రతి ఏటా 22లక్షల చేప పిల్లలను వదలనున్నట్లు చెప్పారు. కార్యక్రమంలో ట్రైనీ కలెక్టర్ సాయి ప్రత్యూష, ఎంపీపీ వీరనారాయణరెడ్డి, ఎఫ్‌డీఓ కిరణ్, చాపాడు ఎంపీపీ లక్షుమయ్య, ఆలీవర్, జిల్లా మత్స్యశాఖ సంఘం అధ్యక్షులు సోమయ్య, వైఎస్సార్‌సీపీ నాయకులు రాజానాయుడు, పాలరామిరెడ్డి, సర్దయర్ భాస్కర్‌రెడ్డి, ఉమాపతి, చంద్ర ఓబుళరెడ్డి, దుగ్గిరెడ్డి, కృష్ణారెడ్డి, బీఎస్ నారాయణరెడ్డి, అనంతరెడ్డి, సుబ్బరాజ, జోగయ్య, గాజుల రామయ్య, నాగార్జున, నాగిరెడ్డి పాల్గొన్నారు.

## ఉత్సాహంగా బ్యాడ్మింటన్ పోటీలు





బ్యాడ్మింటన్ ఆడుతున్న జిల్లా ప్రధాన న్యాయమూర్తి జి. శ్రీదేవి, విన్నర్స్, రన్నర్స్‌గా నిలిచిన న్యాయమూర్తులు, ఉద్యోగులు

కడప స్పోర్ట్స్: కడప నగరం పక్కీరుపల్లెలోని పి.వి.ఆర్. స్పోర్ట్స్ ఎరీనాలో ఆదివారం న్యాయశాఖ ఉద్యోగులు, న్యాయవాదులకు నిర్వహించిన బ్యాడ్మింటన్ పోటీలు ఉత్సాహంగా సాగాయి. జిల్లా ప్రధాన న్యాయమూర్తి జి. శ్రీదేవి ముఖ్యఅతిథిగా విచ్చేసి పోటీలను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ న్యాయమూర్తులు, న్యాయవాదులు, ఉద్యోగులకు క్రీడాపోటీలు నిర్వహించడం సంతోషంగా ఉందన్నారు. రిపబ్లిక్ డే వేడుకలు పురస్కరించుకుని వీటిని నిర్వహిస్తున్నట్లు తెలిపారు. విజేతలకు గణతంత్ర దినోత్సవం రోజున బహుమతులు ప్రదానం చేయనున్నట్లు తెలిపారు. అనంతరం అతిథులుగా విచ్చేసిన న్యాయమూర్తులు జిల్లా అదనపు న్యాయమూర్తి గీత, ఫ్యామిలీకోర్టు న్యాయమూర్తి ఇంతియాజ్ అహ్మద్, జిల్లా న్యాయసేవాధికార సంస్థ కార్యదర్శి ఎస్. బాబాఫక్రుద్దీన్, అదనపు సీనియర్ సివిల్ జడ్జి ఎం. ప్రదీప్‌కుమార్, జి. రామారావు, కడప బార్ అసోసియేషన్ అధ్యక్షుడు జి. రాఘవరెడ్డి తదితరులు మాట్లాడారు. ఈ పోటీలకు వీఆర్‌సీఆర్ ట్రావెల్స్ అధినేత రామచంద్రారెడ్డి సహకారం అందించారు. అనంతరం జిల్లా ప్రధాన న్యాయమూర్తి కొద్దిసేపు బ్యాడ్మింటన్ ఆడి పోటీలను ప్రారంభించారు. కార్యక్రమంలో న్యాయశాఖ ఉద్యోగుల సంఘం నాయకులు భాస్కర్, నారపురెడ్డి, నాగరాజు, అహ్మద్, చిన్నపరెడ్డి, సుబ్బారెడ్డి, వెంకటరమణ, పరమేశు, ఆచారి, గోపి తదితరులు పాల్గొన్నారు.

**బ్యాడ్మింటన్ డబుల్స్ విజేతలు**

మంజునాథ్- మహీంద్రానాయక్ (విన్నర్స్), రామారావు-నాగరాజు (రన్నరప్).

# అంతా రామమయం

- కడపలో వైభవంగా శ్రీరామ శోభయాత్ర
- పాల్గొన్న మేయర్ సురేష్‌బాబు



రామలక్ష్మణుల వేషధారణలో చిన్నారులు





శోభాయాత్రలో భక్త జన సందోహం (ఇన్‌సెట్) 18 అడుగుల రాముడి భారీ విగ్రహం

కడప కల్చరల్: కడప నగరంలో శ్రీరామ శోభాయాత్ర దిగ్విజయంగా సాగిం ది. అయోధ్య ఐక్యతా వేదిక ఆధ్వర్యంలో 8 గంటలపాటు కొనసాగిన ఈ యాత్ర రాత్రి 10 గంటలకు ముగింపు వేదిక వద్దకు చేరుకుంది.ఆద్యంతం కళారూపాల ప్రదర్శనలతో అట్టహాసంగా సాగింది. ధార్మిక సంస్థలు అడుగడుగునా మంచినీరు, కూల్‌డ్రింక్స్, అల్పాహారం, భోజనాలు ఏర్పాటు చేశాయి. అయోధ్య ఆలయంలో సోమవారం శ్రీ బాలరాముని విగ్రహాన్ని ప్రతిష్ఠించనున్న సందర్భంగా ఆదివారం కడప నగరంలో శ్రీరామ శోభాయాత్ర పేరిట భారీ ర్యాలీ నిర్వహించారు. ఆర్‌ఎస్‌ఎస్, వీహెచ్‌పీ తదితర ధార్మిక సంఘాలతోపాటు పలు దేవాలయాల నిర్వాహక కమిటీ సభ్యులు, భక్తులు, భజన బృందాలు, అర్చక సంస్థలు, హిందూ సంఘాల ప్రతినిధులు దాదాపు 30 వేల మంది ర్యాలీలో పాల్గొన్నారు.

- ఉదయం 7.30 గంటలకు చిన్నచౌకులోని శ్రీ వీరాంజనేయ స్వామి ఆలయం వద్ద నుంచి శ్రీరామ శోభాయాత్ర ప్రారంభమైంది. నగర మేయర్ సురేష్‌బాబు ప్రారంభోత్సవ కార్యక్రమంలో పాల్గొన్నారు. రోడ్లు భక్తులతో నిండిపోయాయి.18 అడుగుల భారీ శ్రీరాముని విగ్రహాన్ని ప్రత్యేక రథంలో ఏర్పాటు చేశారు. ర్యాలీలో ఇది ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది. బాహుబలి హనుమంతుడు, దేవతామూర్తుల వేషధారణలు కూడా అందరినీ ఆకట్టుకున్నాయి. డీజే సౌండ్ సిస్టమ్‌తో భక్తిగీతాలకు చిన్నారుల నుంచి వృద్ధుల వరకు నృత్యాలు చేయడం విశేషం.



శోభాయాత్రలో పాల్గొన్న కడప మేయర్ సురేష్‌బాబు

**బాలరాముని చిత్రం**

ఆశారేఖ ఫౌండేషన్ చైర్మన్ నెమలిదిన్నె నాగవేణి బృందం స్థానిక హరిత టూరిజం హోటల్ ప్రాంగణంలో రూపొందించిన బాలరాముని రంగుల చిత్రం యాత్రలో పాల్గొన్న భక్తులను విశేషంగా ఆకట్టుకుంది. వైవీయూలో చిత్రకళను అభ్యసించిన విద్యార్థి కల్యాణ్ ఈ చిత్రాన్ని గంటసేపట్లో తీర్చిదిద్దారు.

**నేటి కార్యక్రమాలు**

సోమవారం హౌసింగ్‌బోర్డు రామాలయం వద్ద ఉదయం 6 గంటలకు శ్రీరామ హోమం, శ్రీరామలక్ష్మణ సీతా ఆంజనేయుల విగ్రహాలకు అభిషేకాలు నిర్వహిస్తారు. అయోధ్యలో జరిగే రామప్రతిష్ఠను ఆలయంలో స్క్రీన్ ఏర్పాటు చేసి లైవ్‌లో భక్తులు చూసే అవకాశం కల్పిస్తున్నారు. అదేరోజు సాయంత్రం పాలకొండపై శ్రీరామ అఖండ దివ్య జ్యోతిని వెలిగించనున్నారు.

## ఏహెచ్‌ఏ పోస్టుల భర్తీకి రంగం సిద్ధం

- నేడు, రేపు అభ్యర్థుల సర్టిఫికెట్ల వెరిఫికేషన్
- 24,25 తేదీల్లో నియామక పత్రాలు అందజేత



కడప అగ్రికల్చర్: ఉమ్మడి వైఎస్సార్ జిల్లావ్యాప్తంగా ఖాళీగా ఉన్న ఏహెచ్‌ఏ(పశుసంవర్ధకశాఖ అసిస్టెంట్) పోస్టుల భర్తీకి ప్రభుత్వం గ్రీన్ సిగ్నల్ ఇచ్చింది ఈ మేరకు పోస్టుల భర్తీకి జిల్లా పశువంవర్థక శాఖ రంగం సిద్ధం చేసింది. ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా 210 పోస్టులు ఖాళీగా ఉన్నాయి. ఇందుకు సంబంధించి ప్రభుత్వం ఇటీవల నోటిఫికేషన్‌ను విడుదల చేసి పరీక్షను కూడా నిర్వహించింది. మెరిట్ జాబితాను కూడా నాలుగు రోజుల కిందట విడుదల చేసింది. ఉమ్మడి జిల్లా యూనిట్‌గా కడపలోని జిల్లా పశుసంవర్ధకశాఖ అధికారి కార్యాలయంలో ఈ నెల 22,23 తేదీల్లో ఎంపికైన అభ్యర్థుల సర్టిఫికెట్ల వెరిఫికేషన్ ప్రక్రియను చేపట్టనున్నారు. ఇందుకోసం 5 టీమ్‌లను ఏర్పాటు చేశారు.ఈ ప్రక్రియ పూర్తికాగానే ఈనెల 24,25 తేదీల్లో ఎంపికైన అభ్యర్థులకు నియామక పత్రాలను అందచేస్తారు. నియామక పత్రాలు అందుకున్న అభ్యర్థులు ఫిబ్రవరి 1వ తేదీన కొత్త ఏహెచ్‌ఏలుగా పోస్టింగ్‌లను తీసుకుంటారు. శిక్షణ అనంతరం విధుల్లో చేరతారు.

**బదిలీలకు అవకాశం..**

ప్రస్తుతం ఏహెచ్‌ఏలుగా పనిచేస్తున్న వారికి రిక్వెస్ట్ బదిలీలకు ప్రభుత్వం అవకాశం కల్పించింది. రైతు భరోసా కేంద్రాన్ని (ఆర్‌బీకే) క్లస్టర్ హెడ్‌క్వార్టర్ ప్రాతిపదికన బదిలీలను నిర్వహించనున్నారు. సొంత గ్రామ పంచాయతీలో కాకుండా ఉన్నప్పుడు ఇచ్చిన అప్లికేషన్లను జిల్లా కలెక్టర్ ద్వారా అనుమతి తీసుకుని బదిలీలు జరపనున్నారు, ఇందులో స్పౌజ్ గ్రౌండ్స్/మ్యూచువల్ రిక్వెస్ట్ ట్రాన్స్‌ఫర్స్ మాత్రమే జిల్లా కలెక్టర్ ద్వారా విజయవాడ పశుసంవర్ధశాఖ డైరెక్టర్ వారికి జనవరి 31వ తేదీలోగా పంపాల్సి ఉంటుంది. వారు పరిశీలించి ఆమోదిస్తారు. ఇవి కూడా ఫిబ్రవరి 2వ తేదీలోపు పూర్తి చేయాల్సి ఉంటుంది.

**ఫిబ్రవరి 1వ తేదీన కొత్త పోస్టులు..**

ఉమ్మడి వైఎస్సార్ జిల్లాలో ఖాళీగా ఉన్న 210 పోస్టులకు సంబంధించి నియామక ప్రక్రియను ఈ నెల 31వ తేదీలోపు పూర్తి చేసి ఫిబ్రవరి 1న ఏహెచ్‌ఏలకు పోస్టింగ్‌లను ఇవ్వనున్నారు. ఎంపికైన వారు శిక్షణ అనంతరం వారికి కేటాయించిన స్థానాల్లో విధుల్లో చేరాల్సి ఉంటుంది.

### ఏర్పాట్లు పూర్తి..



ఏహెచ్‌ఏ పోస్టుల భర్తీకి సంబంధించి ఏర్పాట్లు పూర్తి చేశాం. సర్టిఫికెట్ల వెరిఫికేషన్ కోసం 5 టీమ్‌లను నియమించాం. ఈ ప్రక్రియ సజావుగా జరిగేందుకు అన్ని చర్యలు తీసుకున్నాం. అభ్యర్థులకు 24,25 తేదీల్లో నియామక పత్రాలను అందజేస్తాం.

– డాక్టర్ శారదమ్మ, జిల్లా పశుసంవర్ధకశాఖ అధికారి

# ఆధ్యాత్మిక సిరి.. అరుణగిరి!

ఆకాశాన చీకటి తొలగింది. అందమైన పున్నమి వెలిగింది. అరుణగిరిపై వెండి వెలుగు పండింది. ఆధ్యాత్మిక సిరి భక్తుల్లో నిండింది. కాళ్లు కొండను కొలిచాయి. నోళ్లు శివుడిని స్మరించాయి. చేతులు జోడీ కట్టి దండం పెట్టాయి. అష్టదిక్పాలకులు ఆశీర్వదించగా...గర్భాలయంలో అరుణాచల శివుడు దర్శనమిచ్చాడు. అరుణాచల యాత్ర... ఇప్పుడు జిల్లాలో కొనసాగుతున్న నయా ట్రెండ్. ప్రతి పౌర్ణమికి ఇక్కడి నుంచి చిన్నాపెద్దా తేడా లేకుండా పెద్ద ఎత్తున తరలివెళ్తున్నారు. యాత్ర ప్రత్యేకతలు,కొత్తగా వచ్చిన భక్తిభావంపై 'సాక్షి' ప్రత్యేక కథనం..


ఆలయంలోని శివుడు


రమణ మహర్షి ఆశ్రమం


అరుణాచలంలోని రాజగోపురం

- ప్రతి పౌర్ణమికి అరుణాచలంలో గిరి ప్రదక్షిణ
- జిల్లా నుంచి భారీగా తరలుతున్న భక్తులు
- ప్రత్యేక రైలు, ఆర్టీసీ ఆధ్వర్యంలో బస్సులు
- ప్రవచనకర్తతో మరింత ప్రాచుర్యం

**మదనపల్లె సిటీ :** ఒకప్పుడు తీర్థయాత్రలంటే ఓ వయసు దాటిన వాళ్లు మాత్రమే వెళ్లేవారు. ఇప్పుడు ట్రెండ్ మారింది. యూత్ ఎక్కువగా దైవ దర్శనాలకు వెళ్తున్నారు. ముఖ్యంగా జిల్లా నుంచి ఏడాది కాలంగా తమిళనాడు రాష్ట్రం అరుణాచల పుణ్యక్షేత్రం.. గిరి ప్రదక్షిణలకు వెళ్లే భక్తుల సంఖ్య పెరుగుతూ వస్తోంది. ఇటీవలి కాలంలో పలువురు ప్రవచనకర్తలు వారి ప్రవచనాల్లో అరుణాచల ప్రాముఖ్యాన్ని ప్రస్తావించడంతో అరుణాచలానికి వెళ్లే భక్తుల సంఖ్య పెరిగిపోయింది.

### గిరి ప్రదక్షిణ ప్రత్యేకం

అరుణాచల యాత్రలో గిరి ప్రదక్షిణ ప్రత్యేకం. కొండ చుట్టూ ప్రదక్షిణ చేయడం ద్వారా అనంత శక్తి మనసులోకి ప్రవేశిస్తుందని మఠాధిపతులు, పీఠాధిపతులు చెబుతున్నారు. అరుణాచల కొండ నాలుగైదు ఉప శిఖర కోణాలతో ఏక ముఖ్య శిఖర ముఖంతో 14 కిలోమీటర్లు విస్తరించి ఉంటుంది. గిరి చుట్టూ పరిక్రమణలో అష్టదిక్పాలకులైన ఇంద్ర, అగ్ని, యమ, నైరుతి, వరుణ, వాయు, కుబేర, ఈశాన్య పేర్లతో 8 లింగాలతో ఆలయాలు దర్శనమిస్తాయి. వీటిని అష్టలింగాలు అని పిలుస్తారు. ఆలయాలన్నీ చంద్ర గుర్తులు, రాశులతో సంబంధం కలిగి ఉంటాయి. ప్రదక్షిణ మధ్యలో మోక్షమార్గం వస్తుంది. ఇందులో నుంచి దాటితే పుణ్యం వస్తుందని భక్తుల నమ్మకం. అరుణగిరి కొండపై సాధువులుంటారని భక్తులు బాగా విశ్వసిస్తారు.

అరుణాచలంలో రమణ మహర్షి ఆశ్రమం, టోపీ అమ్మవారి మహత్యాలు సైతం ఇటీవల సోషల్ మీడియాలో వైరల్ అయ్యాయి. కోరిన కోర్కెలు తీరుతాయని, సిరి సంపదలు సిద్ధిస్తాయని అరుణాల శివుడి దర్శనానికి వెళ్తున్నట్లు జిల్లా భక్తులు చెబుతున్నారు.

### ఆర్టీసీ ప్రత్యేక బస్సులు

ప్రతి నెలా పౌర్ణమిని పురస్కరించుకుని అరుణాచల క్షేత్రానికి ఆర్టీసీ ప్రత్యేక బస్సులు నడుపుతోంది. జిల్లాలోని మదనపల్లె, రాయచోటి, రాజంపేట, పీలేరు డిపోల నుంచి ప్రత్యేక బస్సులు నడుపుతున్నారు. ముందుగానే రిజర్వేషన్ సౌకర్యం కల్పించారు. మదనపల్లె వన్,టు డిపోల నుంచి ప్రతి పౌర్ణమికి దాదాపు 15 బస్సులు వెళుతున్నాయి. దీంతో పాటు చిత్తూరు డిపో నుంచి ప్రత్యేక బస్సులు నడుపుతున్నారు. తిరుపతి, చిత్తూరు, కడప రైల్వేస్టేషన్ల నుంచి ప్రత్యేక రైళ్లు నడుపుతున్నారు.

### గిరి ప్రదక్షిణతో మహాపుణ్యం



అరుణాచలంలో గిరి ప్రదక్షిణ 14 కిలో మీటర్లు ఉంటుంది. ఒక్కసారి అరుణాచల గిరి ప్రదక్షిణ చేస్తే కాశీకి వెయ్యి సార్లు వెళ్లిన పుణ్యం వస్తుంది. అరుణాచలంలో అగ్ని లింగం ఉంటుంది. పంచభూత లింగాల్లో అగ్ని లింగం ఒకటి. ప్రతీ భక్తుడు తప్పనిసరిగా అరుణాచల గిరి ప్రదక్షిణ చేస్తే ఎంతో మేలు కలుగుతుంది.

**- కుమారస్వామి, సీటీఎం, మదనపల్లె మండలం**

### మరిచిపోలేని అనుభూతి



నేను నా భర్తతో కలిసి గిరి ప్రదక్షిణ చేశాం. నాకు చాలా బాగా అనిపించింది. ఎంతో మహిమ గల దేవుడు అని నాకు నమ్మకం కలిగింది.14 కిలో మీటర్లు ప్రదక్షిణ చేయడం సాధ్యం కాదని అందరూ అన్నారు. అయినా ప్రదక్షిణ చేశాం. మరిచిపోలేని అనుభూతి పొందాను.

**- మాలతి, మదనపల్లె**

### తప్పక చూడాల్సిన పుణ్యక్షేత్రం



అరుణాచలం తప్పక చూడాల్సిన పుణ్యక్షేత్రం. ఎనిమిది జ్యోతిర్లింగాలను దర్శించుకోవడం, కనులారా స్వామిని చూసే భాగ్యం కలగడం ఎంతో పుణ్యం. దైవం ఉన్నాడు అనడానికి లక్షలాదిగా తరలి వస్తున్న భక్తజనమే సాక్ష్యం. ప్రతి ఒక్కరూ తమ జీవితంలో చూడాల్సిన పవిత్ర పుణ్యక్షేత్రం.

**- ఎం.బాలకృష్ణయాదవ్, మదనపల్లె**

### ప్రతి నెలా బస్సులు



అరుణాచలానికి ఆర్టీసీ నడుపుతున్న ప్రత్యేక బస్సులకు భక్తుల నుంచి అనూహ్య స్పందన వచ్చింది. ప్రతి పౌర్ణమికి బస్సులు నడుపుతున్నాం. భక్తులకు అన్ని సౌకర్యాలు ఉండే విధంగా బస్సులు ఏర్పాటు చేస్తున్నాం. ముందుగానే రిజర్వేషన్ పెట్టాం. డిపోకు మంచి ఆదాయం వస్తోంది.

**- ఆర్‌సీ నిరంజన్, ఆర్టీసీ టు డిపో మేనేజర్, మదనపల్లె**

## క్లుప్తంగా

### మామిడి, నిమ్మ చెట్లు నరికివేత


దాసరి గంగయ్యకు చెందిన మామిడి, నిమ్మ చెట్లు నరికివేసిన దృశ్యం

**పెనగలూరు (ఓబులవారిపల్లె) :** మండలంలోని మూగవారిపల్లె దళితవాడకు చెందిన దాసరి గంగయ్య పొలంలో నిమ్మ, మామిడి చెట్లను నరికివేసినట్లు ఎస్‌ఐ సుబ్బారెడ్డి తెలిపారు. గంగయ్య ఇచ్చిన ఫిర్యాదు మేరకు గ్రామంలో విచారించినట్లు ఆయన తెలిపారు. దళితవాడలోని ఓ వ్యక్తి నరికివేసినట్లు గంగయ్య తన ఫిర్యాదులో అనుమానం వ్యక్తం చేశాడన్నారు. రెండు సంవత్సరాల మామిడి, నిమ్మ చెట్ల మొదలు తొలగించారన్నారు. పూర్తిగా విచారించి కేసు నమోదు చేయనున్నట్లు ఎస్‌ఐ తెలిపారు.

### బంగారు చైను కోసం అవ్వపై కత్తితో దాడి


దాడిలో గాయపడిన వృద్ధురాలు

**మదనపల్లె:** మదనపల్లిలో ఆదివారం రాత్రి దారుణ ఘటన చోటుచేసుకుంది. బంగారు చైను కోసం సొంత మనవడే అవ్వను కత్తితో అతి దారుణంగా 20 చోట్ల పొడిచి హత్యాయత్నానికి పాల్పడ్డాడు. తీవ్ర కలకలం రేపిన ఘటనకు సంబంధించిన వివరాలు.. మండలంలోని కోళ్లబైలు గ్రామం, సచివాలయం 2 వద్ద ఉండే రఘునాథ్ భార్య సుగుణ (50) పై ఆమె మనవడు ఉదయ్ బంగారు చైను కోసం కత్తితో దాడి చేశాడు. ఆమె ప్రతిఘటించడంతో 20 చోట్ల అతి దారుణంగా పొడిచాడు. స్థానికులు బాధిత మహిళను వెంటనే స్థానిక జిల్లా ఆస్పత్రికి తరలించారు. ఆస్పత్రి అత్యవసర విభాగం డాక్టర్లు ఆమెకు మెరుగైన వైద్యం అందించి పరిస్థితి విషమంగా ఉండడంతో తిరుపతికి రెఫర్ చేశారు.

### రోడ్డు ప్రమాదంలో వ్యక్తి మృతి


మృతి చెందిన హుస్సేన్ సాహెబ్

**మైదుకూరు :** పట్టణ సమీపంలోని కర్నూలు – చిత్తూరు జాతీయ రహదారి బైపాస్‌పై ఆదివారం సాయంత్రం జరిగిన రోడ్డు ప్రమాదంలో హుస్సేన్ సాహెబ్(58) అనే వ్యక్తి మృతి చెందాడు. దువ్వూరు మండలం చింతకుంటకు చెందిన హుస్సేన్ సాహెబ్ తాపీ మేస్త్రీగా పని చేస్తున్నాడు. ఆదివారం ఖాజీపేటలో జరిగిన ఓ వివాహానికి హాజరై తిరిగి గ్రామానికి వెళుతుండగా వెనకవైపు నుంచి కారు ఢీ కొన్నట్లు తెలుస్తోంది. ఈ సంఘటనలో హుస్సేన్ సాహెబ్ అక్కడికక్కడే మృతి చెందాడు. అర్బన్ ఎస్‌ఐ ఘన మద్దిలేటి సంఘటనా స్థలాన్ని పరిశీలించారు.

## కేంద్ర ప్రభుత్వ పథకాలను సద్వినియోగం చేసుకోవాలి

**కలకడ :** కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న ఉచిత బియ్యం, ఉచిత బీమా, ఉపాధి పథకాలను సద్వినియోగం చేసుకోవాలని రాజ్యసభ సభ్యుడు సుమిర్‌సింగ్ సోలంకి పేర్కొన్నారు. ఆదివారం మండలంలోని ఎనుగొండపాళ్యం పంచాయతీలో జరిగిన వికసిత భారత్ సంకల్పయాత్ర కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. రాయితీ రుణాలు ఎక్కువగా గ్రామీణ ప్రాంతాల యువత వినియోగించుకుని పారిశ్రామికంగా అభివృద్ధి చెందాలన్నారు. కుటుంబ బీమా, వ్యక్తిగత బీమా, ప్రమాద బీమా, పేద కుటుంబాలకు రాయితీపై పరిశ్రమల ఏర్పాటు, రాయితీ రుణాల మంజూరు వంటి 18 రకాల సేవలను అందించడమే వికసిత భారత్ సంకల్ప యాత్ర లక్ష్యమన్నారు. రాష్ట్రానికి ప్రత్యేక హోదా ఇచ్చే విషయాన్ని కేంద్రం దృష్టికి తీసుకెళ్లాలని కోరారు. ఈ సందర్భంగా ఈ కార్యక్రమంలో బీజేపీ పీలేరు అసెంబ్లీ కన్వీనర్ పొత్తూరి శ్రీకాంత్‌నాయుడు, మండల ఉపాధ్యక్షుడు ఈశ్వర్ నాయుడు, మాజీ సర్పంచ్ కుమార్ నాయుడు, ఎంపీడీఓ రమేశ్వర్‌రెడ్డి, కన్వీనర్ కమలాకర్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.


మాట్లాడుతున్న రాజ్యసభ సభ్యుడు సుమిర్‌సింగ్ సోలంకి

## మనవడి పెళ్లికి వెళ్లి వస్తూ తిరిగి రాని లోకాలకు

**పుల్లంపేట :** మనవడి పెళ్లికి వెళ్లి వస్తూ మార్గమధ్యంలో జరిగిన రోడ్డు ప్రమాదంలో ఓ వృద్ధుడు దుర్మరణం చెందాడు. వివరాలిలా.. మండల పరిధిలోని అప్పయ్యరాజుపేట వద్ద చిన్నంపల్లి గ్రామానికి చెందిన గూడూరు నాగరాజు (85) రాజంపేట పోలిచెరువు కట్టపై ఉన్న వేణుగోపాలస్వామి ఆలయంలో జరిగిన తన మనవడి వివాహానికి హాజరయ్యాడు. అనంతరం తన కుమారుడు తోలుతున్న ఆటోలో తిరిగి వస్తుండగా అప్పయ్యరాజుపేట వద్దకు రాగానే హఠాత్తుగా ఆటో బోల్తా పడింది. ఈ ప్రమాదంలో ఆటోలో ఉన్న గూడూరు నాగరాజు అక్కడికక్కడే మృతి చెందాడు. నాగరాజు మృతి పట్ల గ్రామంలో విషాద ఛాయలు అలుముకున్నాయి. ఆటోలో ఉన్న మరో నలుగురు చిన్నచిన్న గాయాలతో బయటపడ్డారు.

## ఎస్‌ఈబీ సీఐ, ఎస్‌ఐల బదిలీ

**కడప వైఎస్‌ఆర్ సర్కిల్ :** జిల్లాలో స్పెషల్ ఎన్‌ఫోర్స్‌మెంట్ బ్యూరో(ఎస్‌ఈబీ)కు చెందిన సీఐలు, ఎస్‌ఐలు బదిలీ అయ్యారు. జిల్లా నుంచి తొమ్మిది మంది ఇన్‌స్పెక్టర్‌లు, సబ్ ఇన్‌స్పెక్టర్‌లను బదిలీ చేస్తూ ఆ శాఖ డిప్యూటీ కమిషనర్ ఆదివారం ఉత్తర్వులు జారీ చేశారు.

| సీఐ పేరు | ప్రస్తుత స్టేషన్ | బదిలీ అయిన స్టేషన్ |
|---|---|---|
| వై. విజయ్‌కుమార్ | ఇంటెలిజెన్స్ వింగ్, వైఎస్‌ఆర్ జిల్లా | ఎస్‌ఈబీ స్టేషన్, చిత్తూరు అర్బన్ |
| జి. విశ్వనాథరెడ్డి | ఎస్‌ఈబీ స్టేషన్, కడప | ఎస్‌ఈబీ స్టేషన్, నంద్యాల |
| కె. సురేష్‌రెడ్డి | ఎస్‌ఈబీ స్టేషన్, ఎర్రగుంట్ల | ఎస్‌ఈబీ స్టేషన్, పలమనేరు |
| ఇ.మోహన్‌రెడ్డి | ఎస్‌ఈబీ స్టేషన్, ప్రొద్దుటూరు | డీటీఎఫ్, పుట్టపర్తి |
| ఎస్. రామాంజనేయులు | ఎస్‌ఈబీ స్టేషన్, పులివెందుల | ఎస్‌ఈబీ స్టేషన్, కోడుమూరు |
| ఎల్. చెన్నారెడ్డి | ఎస్‌ఈబీ స్టేషన్, ముద్దనూరు | బాపురం చెక్‌పోస్టు |
| బి. లలితాదేవి | ఎస్‌ఈబీ స్టేషన్, మైదుకూరు | ఎస్‌ఈబీ స్టేషన్, సీకేపల్లి |
| యు. ఉరుకుందమ్మ | ఎస్‌ఈబీ స్టేషన్, సిద్ధవటం | ఎస్‌ఈబీ స్టేషన్, పుత్తూరు |
| బి. మురళీ మోహన్ | ఎస్‌ఈబీ స్టేషన్, బద్వేలు | ఎస్‌ఈబీ స్టేషన్, రాయదుర్గం |
| ఎస్‌ఐలు | | |
| జి. శ్రీధరబాబు | ఎస్‌ఈబీ డీటీఎఫ్, కడప | ఎస్‌ఈబీ స్టేషన్, ధర్మవరం, సత్యసాయి జిల్లా |
| ఎస్. చాంద్‌బాషా | జిల్లా టెక్నికల్ వింగ్, కడప | తూముకుంట చెక్ పోస్టు, సత్యసాయి జిల్లా |
| జి. భారతి | ఎస్‌ఈబీ స్టేషన్, కడప | ఎస్‌ఈబీ స్టేషన్, కార్వేటి నగరం, చిత్తూరు జిల్లా |
| టి. శశిధర్ | ఎస్‌ఈబీ స్టేషన్, ఎర్రగుంట్ల | ఎస్‌ఈబీ స్టేషన్, నాగలాపురం, తిరుపతి డివిజన్ |
| ఎ. సరస్వతి | ఎస్‌ఈబీ స్టేషన్, జమ్మలమడుగు | ఎస్‌ఈబీ స్టేషన్, అనంతపురం |
| ఎస్ఎ ఆలీబేగ్ | ఎస్‌ఈబీ స్టేషన్, ప్రొద్దుటూరు | ఎస్‌ఈబీ స్టేషన్, కోడుమూరు, కర్నూలు డివిజన్ |
| కె. కళ్యాణ్‌కుమార్ | ఎస్‌ఈబీ స్టేషన్, పులివెందుల | ఎస్‌ఈబీ స్టేషన్, తాడిపత్రి |
| ఎస్. రూప | ఎస్‌ఈబీ స్టేషన్, బద్వేలు | డీటీఎఫ్, చిత్తూరు |
| ఐ. పురుషోత్తంబాబు | ఎస్‌ఈబీ స్టేషన్, సిద్ధవటం | క్యాటిల్ ఫామ్ చెక్‌పోస్టు |

## కండక్టర్ నిజాయితీ


పర్సును అందజేస్తున్న ఆర్టీసీ సిబ్బంది

**మదనపల్లె సిటీ :** బస్సులో ఓ ప్రయాణికుడు మరిచిపోయిన పర్సును అందజేసి కండక్టర్ నిజాయతీ చాటుకున్నాడు. మదనపల్లె వన్ డిపో మదనపల్లె–తిరుపతి బస్సు సర్వీసులో సునీల్‌కుమార్ అనే ప్రయాణికుడు పర్సును మర్చిపోయి వెళ్లిపోయాడు. గమనించిన కండక్టర్ ఎస్.బాబ్జి, డ్రైవర్ జీవీ ప్రకాష్‌లు పర్సును ఆర్టీసీ డిప్యూటీ సూపరింటెండెంట్ బీవీ నాయక్‌కు అందజేశారు. అందులో రూ.2,120 నగదు, ఏటీఎం కార్డు, డ్రైవింగ్ లైసెన్సు, ఆధార్ కార్డులను అందజేశారు. కండక్టర్ బాబ్జి, డ్రైవర్ జీవీ ప్రకాష్‌లను డీఎం మూరే వెంకటరమణారెడ్డి అభినందించారు.

## ఉరి వేసుకుని యువకుడి ఆత్మహత్య


మృతి చెందిన కొమ్మసాని మనోజ్

**ఎర్రగుంట్ల :** ఎర్రగుంట్ల పట్టణం వేంపల్లి రోడ్డులో నివాసం ఉండే కొమ్మసాని మనోజ్ (21) అనే యువకుడు ఇంటిలో ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడని పట్టణ సీఐ ఈశ్వరయ్య తెలిపారు. ఆయన తెలిపిన వివరాల మేరకు బనగానపల్లె మండల పరిధిలోని చెరువుపల్లె గ్రామానికి చెందిన కొమ్మసాని వెంకటేశ్వర్లు కుమారుడు కొమ్మసాని మనోజ్ ఎర్రగుంట్లలోని మైనింగ్ చెక్‌పోస్టు వద్ద విధులు నిర్వర్తించేవాడు. అక్కడికి సమీపంలో ఓ అద్దె ఇంటిలో నివాసం ఉంటున్నాడు. అదే ఇంటిలో ఉరి వేసుకుని మృతి చెందాడు. కారణాలు తెలియాల్సి ఉందన్నారు.

## వాహనాల తనిఖీల్లో రూ.22 లక్షలు స్వాధీనం

**బద్వేలు అర్బన్ :** పట్టణంలోని నాలుగు రోడ్ల కూడలిలో ఆదివారం తెల్లవారుజామున అర్బన్ పోలీసులు నిర్వహించిన వాహనాల తనిఖీల్లో ఇద్దరు వ్యక్తుల వద్ద నుంచి రూ.22 లక్షల నగదు స్వాధీనం చేసుకున్నారు. ఇందుకు సంబంధించిన వివరాలను అర్బన్ సీఐ పి.యుగంధర్ తెలిపారు. జమ్మలమడుగు నియోజకవర్గం మైలవరం మండలం వేపరాల గ్రామానికి చెందిన బి.సుబ్బరాయుడు గుంటూరు నుండి మైదుకూరుకు ఆర్టీసీ బస్సులో వెళుతుండగా బద్వేలులోని నాలుగు రోడ్ల కూడలిలో నిర్వహించిన తనిఖీల్లో అతని వద్ద ఉన్న బ్యాగులో రూ.8 లక్షల నగదును గుర్తించారు. నగదుకు సంబంధించి ఎలాంటి బిల్లులు లేకపోవడంతో స్వాధీనం చేసుకున్నట్లు ఆయన తెలిపారు. అలాగే తమిళనాడు రాష్ట్రం క్రిష్ణగిరి జిల్లా తగట్టి గ్రామానికి చెందిన రాజమూర్తితన్నీరప్ప బెంగళూరు నుండి కావలికి ఆర్టీసీ బస్సులో వెళుతుండగా బద్వేలులో నిర్వహించిన తనిఖీల్లో అతని వద్ద ఉన్న బ్యాగులో రూ.14 లక్షలు నగదును గుర్తించి స్వాధీనం చేసుకున్నట్లు ఆయన తెలిపారు. నగదును ఐటీ అధికారులకు అందజేయనున్నట్లు పేర్కొన్నారు.

## ఆశా వర్కర్లను మెడికల్ ఉద్యోగులుగా గుర్తించాలి

ఏపీ ఆశా వర్కర్స్ యూనియన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎల్ శాంతి

**ప్రొద్దుటూరు క్రైం :** ఆశా వర్కర్లను మెడికల్ ఉద్యోగులుగా గుర్తించి పర్మినెంట్ చేయాలని ఏపీ ఆశా వర్కర్స్ యూనియన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎల్. శాంతి తెలిపారు. అంత వరకు కనీస వేతనం రూ. 26 వేలు ఇవ్వాలన్నారు. స్థానిక పద్మశాలి కల్యాణ మండపంలో ఆదివారం ఏపీ ఆశా వర్కర్స్ యూనియన్ జిల్లా స్థాయి సదస్సు నిర్వహించారు. ఈ సమావేశంలో ఆమె మాట్లాడుతూ 18 ఏళ్లుగా ఎలాంటి ఉద్యోగ భద్రత, కనీస వేతనం, సాధారణ సెలవులు లేకుండా ఆశా వర్కర్లు పని చేస్తున్నారని చెప్పారు. పెరిగిన ధరలకు అనుగుణంగా సుప్రీం కోర్టు మార్గదర్శకాల ప్రకారం కనీస వేతనం రూ. 26 వేలు ఇవ్వాలన్నారు. ఉద్యోగ, సామాజిక భద్రత, రిటైర్మెంట్ బెనిఫిట్స్ రూ. 5 లక్షలతో పాటు రూ.10 వేలు పెన్షన్ ఇవ్వాలని తెలిపారు. ఏఐటీయూసీ రాష్ట్ర కార్యదర్శి పి.సుబ్బరాయుడు, జిల్లా అధ్యక్షుడు గూంటి వేణుగోపాల్ మాట్లాడుతూ ఐదేళ్లుగా పెండింగ్‌లో ఉన్న టీఏ, డీఏ, లెప్రసీ, మలేరియా, కరోనా అలవెన్సులను వెంటనే చెల్లించాలన్నారు. ఖాళీగా ఉన్న ఆశా కార్యకర్తల పోస్టులను భర్తీ చేయాలని వారు డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో ఏఐటీయూసీ జిల్లా కార్యదర్శి శ్రీరాములు, జిల్లా నాయకుడు చంద్రశేఖర్, ఏపీ ఆశా వర్కర్స్ యూనియన్ జిల్లా ప్రధాన కార్యదర్శి కల్పన, జిల్లా నాయకులు సునంద, అమ్ములు, రమణమ్మ, మంజులవాణి, పట్టణ నాయకులు హరి, నారాయణ, మూర్తి, మున్సిపల్ కార్యదర్శి మధు, ఏఐవైఎఫ్ పట్టణ కార్యదర్శి అనిమెల దస్తగిరి, ఏఐఎస్ఎఫ్ కార్యదర్శి ప్రేమ్‌కుమార్ పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ఏపీ ఆశా వర్కర్స్ యూనియన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎల్.శాంతి

## ఆత్మహత్యకు యత్నించిన మహిళను కాపాడిన ఆర్‌పీఎఫ్ సిబ్బంది

**కడప కోటిరెడ్డిసర్కిల్ :** కుటుంబ కలహాల కారణంగా ఆత్మహత్యకు పాల్పడబోయిన ఓ మహిళను ఆర్‌పీఎఫ్ సిబ్బంది కాపాడి కుటుంబ సభ్యులకు అప్పగించిన ఘటన కడప రైల్వేస్టేషన్‌లో ఆదివారం చోటుచేసుకుంది. ఈ మేరకు ఆర్‌పీఎఫ్ సీఐ శ్రీనివాసులు, ఎస్‌ఐ శంకర్‌రావు తెలిపిన కథనం మేరకు... జిల్లాలోని పెండ్లిమర్రి మండలం గంగనపల్లెకు చెందిన సురేఖ గత కొంతకాలంగా కుటుంబంలో నెలకొన్న సమస్యలతో ఆత్మహత్య చేసుకోవాలని కడప రైల్వేస్టేషన్‌కు చేరుకుంది. ఈ క్రమంలో రైల్వేస్టేషన్‌లోని గూడ్స్ ప్రాంతంలో బాధితురాలు అనుమానాస్పదంగా కనిపించడంతో ఆర్‌పీఎఫ్ సిబ్బంది అదుపులోకి తీసుకుని విచారించారు. ఆ మహిళకు సీఐ, ఎస్‌ఐలు కౌన్సెలింగ్ ఇచ్చి భర్త, కుమారుడిని పిలిపించి అప్పగించారు. ఈ కార్యక్రమంలో ఆర్‌పీఎఫ్ పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.


మహిళను కుటుంబ సభ్యులకు అప్పగిస్తున్న ఎస్‌ఐ శంకర్‌రావు




వైఎస్ జగన్ ముఖ్యమంత్రిగా బాధ్యతలు స్వీకరించాక ప్రజా సంక్షేమానికి ప్రాధాన్యత ఇస్తున్నారు. నెలల తరబడి ఆఫీసుల చుట్టూ తిరిగినా లభించని సర్టిఫికెట్లు నేడు జగనన్న సురక్ష ద్వారా సత్వరమే అందుతున్నాయి. దయనీయ స్థితిలో ఉన్న సర్కారు బడుల రూపు రేఖలు నాడు–నేడుతో ఇప్పుడు పూర్తిగా మారిపోయాయి. సొంతంగా సెంటు స్థలం కొనే స్తోమత లేక.. అద్దె చెల్లించలేక అవస్థలు పడుతున్న పేదల సొంతింటి కల సాకారమవుతోంది. వెరసి పేదల బతుకులు బాగుపడ్డాయని పలువురు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

–సాక్షి నెట్‌వర్క్

### ఉచితంగా ధ్రువీకరణ పత్రాలు



జగనన్న సురక్ష కార్యక్రమం ద్వారా ఉచితంగా ధ్రువీకరణ పత్రాలు అందజేశారు. మా పిల్లలు ఇంటర్, డిగ్రీ చదువుతున్నారు. గతంలో ఇన్‌కం, క్యాస్ట్ తదితర పత్రాలు పొందాలంటే రెవెన్యూ కార్యాలయాల చుట్టూ తిరిగేవాళ్లం. ఈ ప్రభుత్వంలో వలంటీర్లే ఇంటి వద్దకు వచ్చి తమకు కావాల్సిన పత్రాల గురించి తెలుసుకుని వారే దరఖాస్తు చేసి ఉచితంగా ఇంటికి కులం, ఆదాయ ధ్రువీకరణ పత్రాలు తెచ్చి ఇచ్చారు. జగనన్నకు కృతజ్ఞతలు.

**-డి. సరోజ, అంధుల కాలనీ, కమలాపురం**

### సర్కార్ స్కూళ్లలో మెరుగైన సౌకర్యాలు



స్థానికంగా నేను రేకుల షెడ్డులో చిన్న పాటి హోటల్ పెట్టుకుని జీవనం సాగిస్తున్నాను. పిల్లలను ప్రైవేటు స్కూళ్లకు పంపే స్తోమత మాకు లేదు. సీఎం జగనన్న ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థుల కోసం అన్ని సౌకర్యాలు ఉచితంగా కల్పించారు. నా కుమారుడు మహమ్మద్ ఫహాద్ కూడా తెలుగు జెడ్పీ హైస్కూల్‌లో పదవ తరగతి చదువుతున్నాడు. జగనన్న పుణ్యమా అని అమ్మ ఒడి డబ్బులు కూడా ప్రతి ఏటా బ్యాంకులో జమ అవుతున్నాయి. ప్రైవేటు స్కూళ్ల కన్నా సర్కార్ స్కూళ్లే బాగున్నాయి. అయ్యవార్లు కూడా మంచి విద్యను అందించడం సంతోషంగా ఉంది.

**- వాయల్పాడ్ సయ్యద్ బాషా, పెద్దతిప్పసముద్రం, అన్నమయ్య జిల్లా**

### జగనన్న పుణ్యమా అని ఇల్లు మంజూరు



ప్రైవేట్ ఉద్యోగం చేసుకుని కుటుంబాన్ని పోషించుకుంటున్నాము. వచ్చే అరాకొరా ఆదాయం కుటుంబ పోషణకే సరిపోతుంది. సొంతిల్లు నిర్మించుకునే స్తోమత మాకు లేదు. ఇలాంటి తరుణంలో ఇంటి కోసం గ్రామ వలంటీరు ద్వారా దరఖాస్తు చేసుకున్నాము. పేదలందరికీ ఇళ్లు కార్యక్రమంలో మాకు ఇల్లు మంజూరు చేశారు. జగనన్నకు రుణపడి ఉంటాం.

**- శిరీష, బందార్లపల్లె, పీలేరు**

## రైలు ఢీకొని బాలిక దుర్మరణం


పల్లవి (ఫైల్)

**కురబలకోట :** పదో తరగతి చదువుతున్న ఓ బాలికను దురదృష్టవశాత్తు రైలు ఢీకొనడంతో మృతి చెందిన విషాదకర సంఘటన కురబలకోట మండలంలో శనివారం రాత్రి చోటు చేసుకుంది. కదిరి రైల్వే ఎస్‌ఐ రహీం కథనం మేరకు.. కురబలకోట మండలం సింగన్నగారిపల్లెకి చెందిన శంకర్‌కు ముగ్గురు ఆడ పిల్లలు. వీరిలో పదో తరగతి చదువుతున్న పల్లవి (15)కి కొంత కాలంగా మానసిక పరిస్థితి సక్రమంగా లేదు. దీంతో పాఠశాల మాన్పించారు. తల్లిదండ్రులు బేల్దారి పనులతో జీవనం సాగిస్తున్నారు. వారు పనుల నిమిత్తం బయటకు వెళుతూ పల్లవి బయటకు రాకుండా ఇంట్లో ఉంచి గడియపెట్టి వెళ్లారు. ఇంటి నుండి కేకలు విన్పించడంతో సమీపంలో ఊరిలో ఆడుకుంటున్న పిల్లలు గడియ తీశారు. ఇంటి నుండి బయటపడిన బాలిక నేరుగా ఊరికి పక్కనే ఉన్న రైలు పట్టాల వైపు వెళ్లింది. అదే సమయంలో నర్సాపూర్ ఎక్స్‌ప్రెస్ రావడంతో ఢీకొని దుర్మరణం పాలైంది. చీకటి పడినా పల్లవి ఇంటికి రాకపోవడంతో తల్లిదండ్రులు పరిసర ప్రాంతాల్లో వెతికారు. రైలు పట్టాలపై ఛిద్రమై కన్పించింది.

తిరుపతి నుంచి వస్తున్న అమరావతి ఎక్స్‌ప్రెస్ లోకో పైలెట్ గమనించి రైల్వే పోలీసులకు సమాచారం అందించారు. రైల్వే ఎస్‌ఐ రహీం ఘటనా స్థలానికి చేరుకుని మృతదేహాన్ని మదనపల్లె ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. పోస్టుమార్టం నిర్వహించి కుటుంబీకులకు అప్పగించారు.